సాక్షి ఆదిలాబాద్

సోమవారం : 10 : మార్చి : 2025



గెలుపు సంబురం : జిల్లా కేంద్రంలో జాతీయ జెండాలను ప్రదర్శిస్తున్న యువకులు

జయహో..

ఆదిలాబాద్: చాంపియన్స్ ట్రోఫీ ఫైనల్‌లో టీం ఇండియా విజయం సాధించడంతో జిల్లాలో క్రికెట్ అభిమానుల సంబరాలు అంబరాన్నంటాయి. న్యూజిలాండ్‌తో ఆదివారం ఉత్కంఠ భరితంగా సాగిన మ్యాచ్‌లో భారత్ జట్టు గెలుపొందింది. అభిమానులు జయహో అంటూ జాతీయ పతాకాలతో సంబరాల్లో మునిగితేలారు.

న్యూస్‌రీల్

'మోడల్' స్కూల్ టీచర్లపై వేటు

బజార్‌హత్నూర్: ఆదిలాబాద్ జిల్లా బజార్‌హత్నూర్ మండల కేంద్రంలోని మోడల్ స్కూల్‌కు చెందిన ముగ్గురు టీచర్లపై వేటు పడింది. కాంట్రాక్ట్ ఒకేషనల్ ఉపాధ్యాయుడు అజయ్, అవర్లీ బెస్ట్ టీచర్లు జ్ఞానేశ్వర్, ఉమేష్ విద్యార్థినులతో అనుచితంగా ప్రవర్తించినట్లు ఫొటోలు వైరల్ కావడంతో కలెక్టర్ ఆదేశాల మేరకు డీఈవో వారిని సర్వీస్ నుంచి తొలగిస్తూ శనివారం రాత్రి ఉత్తర్వులు జారీ చేశారు. ఇటీవల ఈ మోడల్ స్కూల్ విద్యార్థులను విజ్ఞాన యాత్రకు తీసుకెళ్లారు. ఈ క్రమంలో విద్యార్థినులతో ఈ ముగ్గురు ఉపాధ్యాయులు అనుచితంగా ప్రవర్తించినట్లు ఫొటోలు సోషల్ మీడియాలో వైరల్ అయ్యాయి. విద్యార్థి సంఘాల నాయకులు డీఈవో, కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. స్పందించిన కలెక్టర్ రాజర్షిషా బాధ్యులపై చర్యలు తీసుకోవాలని డీఈవోను ఆదేశించారు. విచారణ చేపట్టిన జిల్లా విద్యాశాఖాధికారి బాధ్యులైన ముగ్గురు ఉపాధ్యాయులను సర్వీస్ నుంచి తొలగిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.

నేడు దివ్యాంగులకు ఉపకరణాలు పంపిణీ



ఆదిలాబాద్‌టౌన్: అలింకో, తెలంగాణ రాష్ట్ర సమగ్ర శిక్షా అభియాన్ ప్రాజెక్ట్ ఆధ్వర్యంలో గతేడాది జూలైలో నిర్వహించిన నిర్ధారణ శిబిరంలో ఎంపికై న దివ్యాంగులకు సోమవారం ఉచిత సహాయ ఉపకరణాలు పంపిణీ చేయనున్నట్లు డీఈవో ప్రణీత ప్రకటనలో తెలిపారు. జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ డైట్ కళాశాల ఆవరణలో గల భవిత కేంద్రంలో ఉదయం 10గంటలకు కార్యక్రమం ఉంటుందని పేర్కొన్నారు. ఎంపికై న దివ్యాంగులు ఒరిజినల్ ఆధార్ కార్డు వెంట తెచ్చుకోవాలని సూచించారు.

'సీఎం ప్రజావాణి' సద్వినియోగం చేసుకోండి

కైలాస్‌నగర్: సీఎం ప్రజావాణి కార్యక్రమంలో భాగంగా సోమవారం సిరికొండ, ఇచ్చోడ మండల కేంద్రాల్లోని ఎంపీడీవో కార్యాలయాల్లో బహిరంగ విచారణ నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ రాజర్షిషా ప్రకటనలో తెలిపారు. కార్యక్రమానికి హాజరయ్యే అర్జీదారులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా వసతులు కల్పించాలని పేర్కొన్నారు. ఆయా మండలాల ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.



జిల్లా కేంద్రంలోని సీసీఐ ఫ్యాక్టరీ

తుక్కులోకి.. సీసీఐ

- పునఃప్రారంభంపై సన్నగిల్లిన ఆశలు
- యంత్ర సామగ్రి అమ్మకానికి టెండర్లు
- వనరులున్నా అందని చేయూత
- కేంద్ర నిర్ణయంపై కార్మికవర్గం మండిపాటు

కైలాస్‌నగర్: వేలాది మంది కార్మికులకు ఉపాధితో పాటు దశాబ్దాల పాటు ఆదిలాబాద్ ప్రాంత అభివృద్ధికి తలమానికంగా నిలిచిన సిమెంట్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (సీసీఐ) ఫ్యాక్టరీ కథ ఇక ముగిసినట్లే అని తెలుస్తోంది. పునఃప్రారంభం కోసం ఏళ్లుగా ఎదురుచూస్తున్న కార్మికుల ఆశలపై కేంద్రం నీళ్లు చల్లింది. సిమెంట్ ఉత్పత్తి, పరిశ్రమ నిర్వహణకు మరో దశాబ్దం పాటు అవసరమైన వనరులున్నా పట్టించుకోకపోవడం గమనార్హం. అయితే ఇందులోని యంత్ర సామగ్రిని తుక్కుగా విక్రయించేందుకు కేంద్రం తాజాగా టెండర్లను ఆహ్వానించింది. దీంతో ఫ్యాక్టరీ ఇక కాలగర్భంలో కలిసిపోయే ప్రమాదమేర్పడింది. మరోవైపు కేంద్ర నిర్ణయంపై రాజకీయ, కార్మిక, ప్రజాసంఘాలు మండిపడుతున్నాయి.

అభివృద్ధికి కల్పతరువులా నిలిచి..

దశాబ్దాల చరిత్ర కలిగిన సీసీఐ ఆదిలాబాద్ ప్రాంత అభివృద్ధికి కల్పతరువులా నిలిచింది. నో లాస్..నో ప్రాఫిట్ కింద దేశవ్యాప్తంగా సొంత సిమెంట్ ఫ్యాక్టరీల ఏర్పాటులో భాగంగా 1965లో దీనిని జిల్లా కేంద్రంలోని తిర్పెల్లి సమీపంలో ఏర్పాటు చేయాలని కేంద్రం నిర్ణయించింది. 1969లో మంజూరు చేసింది. 1984 మేలో అప్పటి ముఖ్యమంత్రి ఎన్టీఆర్, కేంద్రమంత్రి ఎన్డీ తివారీలు దీనిని ప్రారంభించారు. రూ.47 కోట్ల పెట్టుబడి, మూడు వేల మంది ఉద్యోగులతో ప్రారంభమైన ఫ్యాక్టరీ నెలలోనే రూ.3కోట్ల టర్నోవర్ సాధించి రికార్డు సృష్టించింది. 1989 వరకు లాభాల బాటలోనే నడిచింది. రోజూ 1200 టన్నుల మేర సిమెంట్‌ను ఉత్పత్తి చేసింది. కేంద్రమే లెవీ కింద కొనుగోలు చేసి ప్రభుత్వ సంస్థలకు పంపిణీ చేసేది. 1991లో ప్రభుత్వ నూతన ఆర్థిక విధానాల మేరకు ఈ ఫ్యాక్టరీ నుంచి లెవీ సిమెంట్ కొనుగోలును రద్దు చేసింది. ఆర్థిక ప్రోత్సాహకాలను సైతం నిలిపివేసింది. బహిరంగ మార్కెట్‌లో సిమెంట్ విక్రయానికి టెండర్లలో పాల్గొన్నప్పటికీ ప్రైవేటు పరిశ్రమల పోటీ తట్టుకోలేక చతికిలపడింది. చివరకు సిమెంట్ నిల్వలు భారీగా పెరిగి నష్టాలు మొదలయ్యాయి. దీంతో ప్రభుత్వం 1996లో బీఐఎఫ్ఆర్‌కి అప్పగించింది. ఈ యూనిట్‌కు ఆర్థిక పరిపుష్టి కలిగించాలని బీఐఎఫ్ఆర్ సూచించినా కేంద్రం స్పందించలేదు. 2002లో ఆదిలాబాద్ యూనిట్‌ను మూసివేయాలని సీసీఐ నిర్ణయించింది. ఎలాగోలా ఆరేళ్లు నెట్టుకుంటూ వచ్చిన సీసీఐలో 2008 నుంచి ఉత్పత్తి పూర్తిగా నిలిచిపోయింది. అప్పుడు మూతపడ్డ పరిశ్రమ ఇప్పటి వరకు తెరచుకోలేదు.

అన్ని వనరులున్నా స్పందించని కేంద్రం

1,500 మందికి ప్రత్యక్షంగా.. మరో 3వేల మందికి పరోక్షంగా ఉపాధి కల్పించిన ఈ ఫ్యాక్టరీ పునఃప్రారంభంపై కార్మికవర్గం గంపెడాశతో ఎదురుచూస్తూ వస్తోంది. అయితే కేంద్రం తాజా నిర్ణయంతో సీసీఐ కథ ఇక ముగిసినట్లే అని తెలుస్తోంది. నిర్వహణకు అవసరమైన అన్ని వనరులు అందుబాటులో ఉన్నా ప్రభుత్వం పట్టించుకోకపోవడంపై ఈ ప్రాంతవాసుల నుంచి విమర్శలు వ్యక్తమవుతున్నాయి. సిమెంట్ ఉత్పత్తికి ప్రధాన వనరు అయిన సున్నపురాయి మరో 30 ఏళ్లకు సరిపడా ఉంది. అలాగే 750 ఎకరాల సొంత భూమితో పాటు మరో 2వేల ఎకరాల మేర లీజు భూములున్నాయి. 120 ఎకరాల్లో పరిశ్రమ విస్తరించి ఉంది. ఉద్యోగుల భవన సముదాయం అందుబాటులో ఉంది. ఉత్తర, దక్షిణ భారతానికి సిమెంట్‌ను రవాణా చేసేందుకు అనుకూలంగా రైలు, రోడ్డు మార్గాలు ఉన్నాయి. ఇలా అన్ని వనరులు అందుబాటులో ఉన్న పరిశ్రమను పునరుద్ధరించాలని కార్మిక సంఘాలు ఏళ్లుగా డిమాండ్ చేస్తున్నాయి. రాజకీయ పార్టీలు సైతం ఎన్నికల సమయంలో ఇదే హామీతో ఓట్లను దండుకుంటున్నాయి. అయితే పరిశ్రమ పునరుద్ధరణకు మాత్రం ఎలాంటి చొరవచూపకపోవడం గమనార్హం.

తుక్కుగా అమ్మేందుకు నిర్ణయం...

ఆదిలాబాద్ ఎంపీ, ఎమ్మెల్యే ఇద్దరూ బీజేపీ నుంచే ఉండటంతో ఫ్యాక్టరీ పునరుద్ధరణపై కార్మికవర్గంలో ఆశలు రేకెత్తాయి. అయితే కేంద్రం ఆ దిశగా ఎలాంటి చొరవ చూపలేదు. ఏళ్లుగా ఫ్యాక్టరీ మూతపడి ఉండడం, నిర్వహణ లేకపోవడంతో యంత్రాలన్నీ తుప్పుపట్టాయి. నివాస భవన సముదాయాలు సైతం శిథిలావస్థకు చేరాయి. లారీలు, టిప్పర్లువంటి వాహనాలు పనికిరాకుండా పోయాయి. ఈ క్రమంలో 71 యంత్రాలు, ఇతర భవనాల సామగ్రిని అమ్మేందుకోసం రూ.43.30 కోట్లతో టెండర్లు పిలిచారు. ఇందులో పాల్గొనే కాంట్రాక్టర్లు రూ.1.92 కోట్లను ఈఎండీగా చెల్లించాలని నిర్ణయించారు. ఈ టెండర్లను ఈనెల 7న తెరవాల్సి ఉంది. అయితే టెండర్ల గడువు ముగిసినా ఆ ప్రక్రియపై తమకు ఎలాంటి సమాచారం లేదని ఫ్యాక్టరీ జీఎం తాజాగా పేర్కొనడం గమనార్హం. మరోవైపు కేంద్ర నిర్ణయంపై ఆందోళనలు ఉధృతం చేసే దిశగా కార్మికులు సిద్ధమవుతున్నట్లు తెలుస్తోంది.

అంతా ఢిల్లీ స్థాయిలోనే..

ఫ్యాక్టరీలోని యంత్రాలు, ఇతర సామగ్రిని స్క్రాప్ కింద విక్రయించేందుకు కేంద్రం ఆన్‌లైన్ టెండర్లను ఆహ్వానించింది. వీటిని ఈ నెల 7న తెరవాల్సి ఉంది. అయితే ఈ ప్రక్రియ అంతా ఢిల్లీస్థాయిలోనే జరుగుతుంది. అక్కడి నుంచి పూర్తి సమాచారం వస్తే తప్ప ఆ వివరాలేమి తెలియవు.

– ఆశిష్‌శర్మ, సీసీఐ జనరల్ మేనేజర్, ఆదిలాబాద్

నిబంధనలు తూచ్..

- అనుమతులు లేకుండా ఇటుక బట్టీల నిర్వహణ
- ప్రభుత్వానికి పన్ను చెల్లించని నిర్వాహకులు
- కార్మికులకు కరువైన వసతులు
- అయినా పట్టించుకోని అధికారులు



మావలలోని ఇటుక బట్టీ

ఆదిలాబాద్‌టౌన్: జిల్లాలో ఇటుక బట్టీల దందా జోరుగా సాగుతోంది. నిర్వాహకులు నిబంధనలు పాటించకున్నా అధికారులు 'మామూలు'గా వ్యవహరించడంపై సర్వత్రా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఇటుక బట్టీ వ్యాపారం చేసే ముందు గ్రామపంచాయతీ, ఇండస్ట్రీయల్, మైనింగ్, ఇతర శాఖల అనుమతులు తప్పనిసరి. అయితే జిల్లాలో ఏ వ్యాపారి కూడా ఈ అనుమతులు తీసుకోకుండా దందా నిర్వహిస్తుండడం గమనార్హం. వీరంతా రూ.లక్షల్లో ఆదాయం గడిస్తున్నా సర్కారుకు రూపాయి పన్ను చెల్లించడం లేదని తెలుస్తోంది. మరోవైపు ఇందులో పనిచేసే కార్మికులకు సైతం కనీస సౌకర్యాలు అందని పరిస్థితి. వారి పిల్లల బాల్యం సైతం బట్టీల్లోనే మగ్గుతోంది. చిరుప్రాయంలోనే ఆ పసి మొగ్గలు బాల కార్మికులుగా మారుతున్న దుస్థితి.

కార్మికులకు సౌకర్యాలు కరువు

జిల్లా వ్యాప్తంగా దాదాపు వందకు పైగా ఇటుక బట్టీలు కొనసాగుతున్నాయి. అయితే నిర్వాహకులు ఎక్కడా నిబంధనలు పాటించడం లేదు. మావల మండల కేంద్రం, బట్టిసావర్గాం, ఆదిలాబాద్ మండలంలోని యాపల్‌గూడ, అంకోలి, తంతోలి, బంగారుగూడ, తలమడుగు మండలంలోని కజ్జర్ల, ఉండం, తాంసి, భీంపూర్, ఇంద్రవెల్లి తదితర మండలాల్లో ఈ బట్టీలను నిర్వహిస్తున్నారు. ఇందులో పనిచేసేందుకు కార్మికులను జిల్లాతో పాటు మహారాష్ట్ర, ఒడిశా, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాల నుంచి నిర్వాహకులు తీసుకొస్తున్నారు. ఊరికి దూరంగా, అటవీ ప్రాంతాలు, పంట పొలాల్లో బట్టీలను నిర్వహిస్తున్నారు. ఆయా ప్రాంతాల్లో కార్మికులకు కనీస సౌకర్యాలు ఉండవు. చిన్న చిన్న గుడిసెలు వేసుకుని నివాసం ఉంటున్నారు. విద్యుత్ సౌకర్యం లేకపోవడంతో రాత్రి వేళలో విషకీటకాల బారిన పడిన ఘటనలు సైతం ఉన్నాయి.

బట్టీల్లోనే బాల్యం..

వేరే ప్రాంతాల నుంచి వలస వచ్చిన కార్మికుల పిల్లలు సైతం ఇటుక బట్టీల్లోనే పనులు చేస్తున్నారు. నిబంధనల ప్రకారం 6 నుంచి 14 ఏళ్లలోపు వారు ఎలాంటి పనులు చేయడానికి వీల్లేదు. అయితే ఏ బట్టీ వద్ద చూసినా బాలకార్మికులు దర్శనమిస్తుండడం గమనార్హం. బడిలో గడపాల్సిన బాల్యం బట్టీల్లో మగ్గుతున్నా అధికారులు అటువైపు కన్నెత్తి చూడకపోవడం విమర్శలకు తావిస్తోంది.

నోటీసులు జారీ చేస్తాం..

నిబంధనలకు విరుద్ధంగా ఇటుక బట్టీలు నిర్వహిస్తున్న వారికి నోటీసులు జారీ చేసి శాఖాపరమైన చర్యలు చేపడతాం. వ్యాపారులు సంబంధిత గ్రామపంచాయతీ, ఇండస్ట్రీయల్ అనుమతి పొందిన తర్వాత మైనింగ్ శాఖ నుంచి అనుమతి తీసుకోవాలి. ఆన్‌లైన్‌లో రిజిస్ట్రేషన్ చేసుకున్నాక సర్టిఫికెట్ జారీ చేస్తాం. పంచాయతీ శాఖ అధికారుల నుంచి ఏయే జీపీల్లో ఇటుక బట్టీలు ఉన్నాయో వివరాలు సేకరిస్తాం.

– రవీందర్, మైనింగ్ ఏడీ, ఆదిలాబాద్

అనుమతులు గాలికి..

ఇటుక బట్టీల ఏర్పాటుకు గ్రామపంచాయతీ, రెవెన్యూ, ఇండస్ట్రీయల్, మైనింగ్ శాఖల అనుమతులు తప్పనిసరి. అయితే జిల్లాలో ఎక్కడా వీటిని పాటించడం లేదు. నిబంధనలకు విరుద్ధంగా అటవీ ప్రాంతాల సమీపంలో, వ్యవసాయ భూముల్లో, అసైన్డ్, ఏజెన్సీ భూముల్లో బట్టీల నిర్వహణ చేపడుతున్నారు. గిరిజన, అమాయక ప్రజల అవసరాలు ఆసరాగా చేసుకొని వారికి కొంత డబ్బు ముట్టజెప్పి తమ వ్యాపారాన్ని కొనసాగిస్తున్నారు. ఈ భూములు వ్యవసాయేతర పనులకు వినియోగించేందుకు నాలా పన్ను చెల్లించాల్సి ఉంటుంది. అలాగే భూగర్భ, గనుల శాఖ నుంచి అనుమతి పొందాల్సి ఉంటుంది. కానీ ఎక్కడా సుంకం చెల్లించకపోగా, అనుమతి కూడా తీసుకోవడం లేదు. తహసీల్దార్ కార్యాలయం నుంచి, కాలుష్య నియంత్రణ శాఖ అధికారి నుంచి అనుమతి పత్రం పొందాలి. అవేమీ పాటించడం లేదని తెలుస్తోంది. అలాగే ప్రభుత్వ స్థలాలు, అటవీ ప్రాంతం, వాగుల సమీపంలో, చెరువుల వద్ద వాల్టా చట్టాన్ని ఉల్లంఘించి ఎక్కడబడితే అక్కడ గోతులు తవ్వి ఇటుకల తయారీకి మట్టిని తరలిస్తున్నారు. కొంత మంది అటవీ శాఖాధికారులను మచ్చిక చేసుకుని నిర్వాహకులు తమ దందా సాగిస్తున్నారనే ఆరోపణలున్నాయి. అలాగే వ్యవసాయం కోసం ప్రభుత్వం ఉచితంగా సరఫరా చేస్తున్న విద్యుత్‌ను ఈ బట్టీల నిర్వాహకులు అక్రమ మార్గంలో వినియోగిస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత శాఖల అధికారులు స్పందించి చర్యలు తీసుకుంటారో లేదా వేచి చూడాల్సిందే.

- ఆదిలాబాద్ రూరల్ ఎంపీడీవో కార్యాలయంలో ఆఫీస్ సబార్డినేట్‌గా పనిచేయాల్సిన ఓ ఉద్యోగి మహారాష్ట్రలో వ్యాపారం చేస్తున్నాడు. ప్రతి నెలా రూ.60వేలకు పైగా వేతనం పొందుతూ విధులకు ఎగనామం పెడుతున్నాడు. తనకు బదులు ఓ ప్రైవేట్ వ్యక్తిని నియమించుకుని అతడికి రూ.10వేల చొప్పున చెల్లిస్తున్నాడు.
- జిల్లా పంచాయతీ కార్యాలయంలో పనిచేయాల్సిన ఓ డ్రైవర్ మూడేళ్లుగా విధులకు రాకుండానే నెలకు రూ.90వేల చొప్పున వేతనం పొందుతున్నాడు. ఇందుకు గాను ఆ శాఖలో పనిచేసే అధికారికి అతడు ప్రతి నెలా రూ.25వేలు ముట్టచెబుతున్నట్లుగా కార్యాలయ వర్గాలు పేర్కొంటున్నాయి.
- ఆదిలాబాద్ మున్సిపల్ కార్యాలయంలోని ఎస్టాబ్లిష్‌మెంట్ విభాగంలో జూనియర్ అసిస్టెంట్‌గా నియామకమైన ఓ ఉద్యోగి జాబ్‌లో చేరిన తర్వాత ఒక్కరోజు కూడా విధులకు హాజరుకాలేదని తెలుస్తోంది. తన స్థానంలో హాజరవుతున్న ఓ ప్రైవేట్ వ్యక్తి సర్కారు ఉద్యోగిలా విధులు నిర్వహిస్తుండటం విస్మయానికి గురిచేస్తోంది.
- మావల ఎంపీడీవో కార్యాలయంలో పనిచేసే మరో ఉద్యోగి ఏడాదిగా విధులకు దుమ్మా కొడుతున్నాడు. ప్రతినెలా వేలాది రూపాయల వేతనం మాత్రం పొందుతున్నాడు. తన స్థానంలో ఓ మహిళను నియమించుకుని నెలకు రూ.8వేల చొప్పున చెల్లిస్తున్నాడు.
- జిల్లా పంచాయతీ కార్యాలయంలో పనిచేసే మరో ఉద్యోగి జాబ్‌లో చేరినప్పటి నుంచే డుమ్మా కొడుతున్నట్లు సమాచారం. రూ.40వేల వేతనం పొందే సద రు ఉద్యోగి కార్యాలయ అధికారులను మేనేజ్ చేస్తున్నారని తెలుస్తోంది. ఇందుకు గాను ప్రతి నెలా రూ. 15వేల చొప్పున ముట్టజెబుతున్నట్లు సమాచారం.
- ఆదిలాబాద్ రిమ్స్‌లోని మలేరియా విభాగంలో పనిచేయాల్సిన ఓ ల్యాబ్ టెక్నీషియన్ కొన్నేళ్లుగా విధులకు హాజరుకావడం లేదు. తనకు బదులు ఓ ప్రైవేట్ వ్యక్తిని నియమించుకున్నాడు. బినామీకి కొంత నగదు ముట్టజెబుతూ వేలాది రూపాయలు తన జేబులో వేసుకుంటున్నాడు.
- ఆదిలాబాద్ జెడ్పీ కార్యాలయంలో పనిచేయాల్సిన ఓ ఉద్యోగిని మూడేళ్లుగా విధులకు రావడం లేదు. రూ. 40వేల వేతనం పొందే సదరు ఉద్యోగిని తనకు బదులు ఓ ప్రైవేట్ వ్యక్తిని నియమించుకుని పనిచేయిస్తున్నారు.
- దళిత అభివృద్ధి శాఖ కార్యాలయంలో పనిచేయాల్సిన ఓ ఉద్యోగికి బదులు ప్రైవేట్ వ్యక్తి విధులు నిర్వహిస్తున్నాడు. రూ.40వేల వేతనం పొందే సదరు ఉద్యోగి విధులకు గైర్హాజరవుతూ ప్రైవేట్ వ్యక్తికి రూ.8వేల చొప్పున వేతనం చెల్లిస్తున్నాడు.

బినామీ ఉద్యోగులు!

- పలు శాఖల్లో యథేచ్ఛగా విధులు
- నియామకమైన వారు పలు దందాల్లో నిమగ్నం
- అరకొర వేతనాలతో బినామీలతో సేవలు
- పట్టించుకోని అధికారులు



జిల్లా పరిషత్ కార్యాలయం

కై లాస్‌నగర్: జిల్లాలోని పలు ప్రభుత్వ శాఖల్లో బినామీలు ఉద్యోగులుగా చెలామణి అవుతున్నారు. సంబంధిత కార్యాలయాల్లో సేవలందించాల్సిన పలువురు ఉద్యోగులు ఏళ్లుగా విధులకు ఎగనామం పెడుతున్నారు. ప్రైవేట్‌గా రియల్ ఎస్టేట్, ఇతరత్రా వ్యాపారాలు నిర్వహిస్తూ తమ రెగ్యులర్ విధులకు డుమ్మా కొడుతున్నారు. అయితే ప్రభుత్వం నుంచి ప్రతి నెలా వేలాది రూపాయల వేతనాలు మాత్రం పొందుతున్నారు. తమకు బదులు ప్రైవేట్ వ్యక్తులను నియమించుకుని వారికి కొంత ముట్టజెబుతూ కాలం వెల్లదీస్తున్నారు. కొంతమందైతే బినామీలను కూడా నియమించడం లేదు. తాము తీసుకునే వేతనంలో నుంచి కొంత మొత్తాన్ని అధికారులకు అందజేస్తూ ఏళ్లుగా కార్యాలయాల ముఖం కూడా చూడకపోవడం గమనార్హం. ఇంత జరుగుతున్నా అధికారులు 'మామూలు'గా వ్యవహరిస్తుండటం విమర్శలకు తావిస్తోంది.

ప్రైవేట్‌గా వ్యాపారాల నిర్వహణ..

సర్కారు కొలువు అనేది ప్రతీ నిరుద్యోగి కల. దాన్ని సాధించేందుకు రేయింబవళ్లు శ్రమిస్తుంటారు. అలాంటిది ప్రభుత్వ ఉద్యోగం సాధించిన కొంతమంది ప్రబుద్ధులు దాన్ని నిర్లక్ష్యం చేస్తున్నారు. కా ర్యాలయాల్లో విధులు నిర్వహించకుండా ప్రైవేట్ వ్యాపారాలు, ఇతరత్రా పనులకు ప్రాధాన్యమిస్తున్నారు. ఏళ్ల తరబడి విధులకు ఎగనామం పెడుతున్నారు. పోనీ ఏదైనా తీవ్ర అనారోగ్యం, పక్షపాతం, విధులు నిర్వహించలేని పరిస్థితి అంటే అదీ లేదు. మరి దీర్ఘకాలిక సెలవు ఏమైనా పెట్టారా అంటే అదీ లేదు. విధులకు హాజరుకాకున్నా వచ్చినట్లుగా ఒక్కో ఉద్యోగి రూ.40వేల నుంచి రూ.90వేల వర కు ప్రతి నెలా వేతనం పొందుతున్నారు. అయితే వీరంతా తమకు బదులుగా బినామీలను నియమించుకుంటున్నారు. వారికి ఎంతో కొంత ముట్టజెప్పి తమకు ఉద్యోగపరంగా ఇబ్బంది రాకుండా జాగ్రత్తపడుతున్నారు. మరోవైపు ఎప్పటికప్పుడు పర్యవేక్షించాల్సిన సంబంధిత అధికారులు 'మామూలు'గా వ్యవహిస్తుండడంతో బినామీలే రెగ్యులర్ ఉద్యోగుల మాదిరిగా చెలామణి అవుతున్నారు.

పలు శాఖల్లో ఇదే పరిస్థితి..

ఈ బినామీలు ఏ ఒక్క శాఖకో పరిమితం కాలేదు. కలెక్టరేట్ మొదలుకుని సంక్షేమ, మున్సిపల్, వైద్యారోగ్య, రిమ్స్, విద్య, జిల్లా పరిషత్ తదితర శాఖల కార్యాలయాల్లో పని చేస్తున్నారు. అయితే వీరి ద్వారా ఇబ్బందేమి లేదని అధికారులు భావిస్తున్నప్పటికీ రేపు ఏదైనా జరిగితే అందుకు బాధ్యత ఎవరు వహిస్తారనేది ప్రశ్నార్థకంగా మారుతోంది. కార్యాలయాల్లోని విలువైన వస్తువులు, ఇతరత్రా సామగ్రి చోరీకి గురైతే ఎవరిని బాధ్యులను చేస్తారనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి. ఇప్పటికైనా జిల్లా ఉన్నతాధికారులు దృష్టి సారించి బాధ్యులపై చర్యలు తీసుకోవాలనే డిమాండ్ సర్వత్రా వినిపిస్తోంది.

విచారణ చేపట్టి చర్యలు తీసుకుంటాం..

ప్రభుత్వ ఉద్యోగులకు బదులు ఇతర వ్యక్తులు విధులు నిర్వహించడం పూర్తిగా నిబంధనలకు విరుద్ధం. ఏళ్లుగా విధులకు గైర్హాజర య్యే వారిపై చట్టపరంగా చర్యలు తీసుకో వాల్సిన బాధ్యత ఆయా శాఖల అధికారులపై ఉంటుంది. ఏయే కార్యాలయాల్లో అలాంటి వారున్నారో విచారించి నిబంధనల ప్రకారం వారిపై తగు చర్యలు తీసుకుంటాం. – శ్యామలాదేవి, అదనపు కలెక్టర్ (రెవెన్యూ)

జిల్లాను ఎప్పటికీ మరిచిపోలేను



ఎస్పీ కుటుంబీకుల వాహనాన్ని తాడుతో లాగుతున్న పోలీసు అధికారులు

- బదిలీ వీడ్కోలు సందర్భంగా ఎస్పీ గౌస్ ఆలం
- పూల వర్షం కురిపించిన పోలీస్ అధికారులు



ఎస్పీ కుటుంబీకులపై పూలవర్షం కురిపిస్తూ..

ఆదిలాబాద్‌టౌన్: ఆదిలాబాద్ జిల్లాను ఎప్పటికీ మరిచిపోలేనని ఎస్పీ గౌస్ ఆలం అన్నారు. కరీంనగర్ సీపీగా బదిలీపై వెళ్తున్న ఆయనకు జిల్లా పోలీసు అధికారులు ఆదివారం ఘనంగా వీడ్కోలు పలికారు. స్థానిక పోలీస్ పరేడ్ మైదానంలో నిర్వహించిన కార్యక్రమంలో పోలీసులు గౌరవ వందనం సమర్పించారు. గజమాలతో సత్కరించారు. ప్రత్యేకంగా అలంకరించిన జీపులో ఉన్న ఎస్పీ కుటుంబీకులపై పూల వర్షం కురిపించారు. అనంతరం పోలీస్ అధికారులు, ఉద్యోగులు, సిబ్బంది హెడ్‌క్వార్టర్స్ వరకు తాడుతో లాగి తమ అభిమానాన్ని చాటారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ.. జిల్లాను, ఇక్కడి సిబ్బందిని విడిచి వెళ్లడం బాధాకరమన్నారు. 14 నెలల పాటు చేసిన సేవలు, పోలీసులతో తన అనుబంధాన్ని పంచుకున్నారు. సహకరించిన ప్రతీ ఒక్కరికి ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో డీఎస్పీలు జీవన్‌రెడ్డి, శ్రీనివాస్, నాగేందర్, హసీబుల్లా, సీఐలు, రిజర్వ్ ఇన్‌స్పెక్టర్లు, ఎస్సైలు, రిజర్వ్ సబ్ ఇన్‌స్పెక్టర్లు, పోలీసు సిబ్బంది, వివిధ శాఖల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఎల్‌ఆర్‌ఎస్ ప్రక్రియ వేగవంతం చేయండి

- కలెక్టర్ రాజర్షి షా

కై లాస్‌నగర్: ఎల్‌ఆర్‌ఎస్ దరఖాస్తుల పరిశీలనలో వేగం పెంచి, మార్చి 31లోగా క్రమబద్ధీకరణ ప్రక్రియ పూర్తయ్యేలా శ్రద్ధ వహించాలని కలెక్టర్ రాజర్షి షా అధికారులను ఆదేశించారు. తన క్యాంపు కార్యాలయం నుంచి వివిధ శాఖల అధికారులతో ఆదివారం సాయంత్రం టెలీ కాన్ఫరెన్స్ నిర్వహించారు. వేసవి దృష్ట్యా గ్రామాల్లో నీటి ఎద్దడి తలెత్తకుండా చర్యలు చేపట్టాలన్నారు. బోర్లు, పైపులైన్, మోటార్లు చెడిపోతే వెంటనే మరమ్మతులు చేయించాలని, ప్రత్యామ్నాయ మార్గాల ద్వారా నీటిని అందించాలని ఆదేశించారు. దివ్యాంగులకు సదరం సర్టిఫికెట్ స్థానంలో యూనిక్ డిజెబులిటీ ఐడీ కార్డులను కేంద్రం జారీ చేస్తుందని ఆ దిశగా తగు చర్యలు చేపట్టాలని సూచించారు. దివ్యాంగులకు వైద్యులు ధ్రువీకరించిన వైకల్య శాతంతో కూడిన సదరం సర్టిఫికెట్‌ను యూడీఐడీ పోర్టల్‌లో నమోదు చేయాలన్నారు. యూడీఐడీ ద్వారానే పింఛన్ పొందాల్సి ఉంటుందన్నారు. అలాగే ఎల్‌ఆర్‌ఎస్ దరఖాస్తుదారులు సకాలంలో క్రమబద్ధీకరించుకుని 25 శాతం రాయితీ పొందేలా తగు చర్యలు చేపట్టాలన్నారు. దీనిపై విస్తృత అవగాహన కల్పించాలన్నారు. మున్సిపల్, పంచాయితీ అధికారులు ప్రత్యేక చొరవ చూపాలన్నారు. సమావేశంలో ఐటీడీఏ పీవో ఖుష్బూ గుప్తా, అదనపు కలెక్టర్ శ్యామలాదేవి, సబ్ కలెక్టర్ యువరాజ్, జెడ్పీ సీఈవో జితేందర్‌రెడ్డి, డీఆర్డీవో రాథోడ్ రవీందర్ తదితరులు పాల్గొన్నారు.


బోథ్: గురువులతో పూర్వ విద్యార్థులు


మందమర్రి రైల్వేస్టేషన్ రోడ్డులోని జెడ్పీ గర్ల్స్ పాఠశాల విద్యార్థినులు


ఒర్రెగడ్డ ఏరియాలోని జెడ్పీ బాయ్స్ హైస్కూల్ పూర్వ విద్యార్థులు


ఇచ్చోడ: బోరిగామ జెడ్పీ ఉన్నత పాఠశాల పూర్వ విద్యార్థులు

అ'పూర్వం'..ఆత్మీయం

ఇచ్చోడ/నిర్మల్‌టౌన్/నర్సాపూర్(జి)/మందమర్రిరూరల్/బోథ్: ఇచ్చోడ మండలంలోని బోరిగామ జెడ్పీ ఉన్నత పాఠశాలలో 1991-92 బ్యాచ్ ఎస్సెస్సీ విద్యార్థులు అపూర్వ సమ్మేళనం పేరిట ఆదివారం కలుసుకున్నారు. అలాగే నిర్మల్‌లోని జుమ్మెరాత్‌పేట్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 1994-95 బ్యాచ్ విద్యార్థులు, నర్సాపూర్ (జి) జెడ్పీసెకండరీ పాఠశాలలో 1997-98 బ్యాచ్, మందమర్రిలోని రైల్వేస్టేషన్ రోడ్డులోని జెడ్పీ గర్ల్స్, ఒర్రెగడ్డ ఏరియాలోని జెడ్పీ బాయ్స్ హైస్కూళ్లలో 1999-2000 బ్యాచ్, బోథ్‌లోని ప్రగతి విద్యానికేతన్ ఉన్నత పాఠశాలలో 2004-05 బ్యాచ్ విద్యార్థులు చదువులమ్మ ఒడికి చేరారు. చిన్ననాటి జ్ఞాపకాలు నెమరువేసుకున్నారు. గురువులను సన్మానించారు. అనంతరం సహపంక్తి భోజనాలు చేశారు.


నర్సాపూర్(జి): గురువులతో పూర్వ విద్యార్థులు


నిర్మల్‌లోని జుమ్మెరాత్‌పేట్ పాఠశాల పూర్వ విద్యార్థులు

క్లుప్తంగా

విజయవంతంగా ఫ్యాకల్టీ డెవలప్‌మెంట్ ప్రోగ్రాం


ఫ్యాకల్టీ బృందంతో ఇన్‌చార్జి, అధికారులు

బాసర: ఆర్జీయూకేటీలో ఎలక్ట్రానిక్స్ కమ్యూనికేషన్ ఇంజినీరింగ్ విభాగం, ఎన్ఐటీటీటీఆర్ చండీగఢ్‌తో కలిసి ఈనెల 3 నుంచి 7వ తేదీ వరకు 'ఉచిత సిమ్యులేటర్లను ఉపయోగించి ఈసీఈ ల్యాబ్ సబ్జెక్టులు బోధించడం'అనే అంశంపై ఫ్యాకల్టీ డెవలప్‌మెంట్ ప్రోగ్రాం విజయవంతంగా ముగిసింది. ఆదివారం ట్రిపుల్ ఐటీలో ఏర్పాటు కార్యక్రమంలో ఇన్‌చార్జి వీసీ, ప్రొఫెసర్ గోవర్ధన్ మాట్లాడారు. సిమ్యులేటర్లలో వర్చువల్ ల్యాబ్‌లు, మల్టీసిమ్‌లైవ్, ల్యాబ్‌లైవ్, టింకర్‌క్యాడ్, వా వ్కి, సైల్యాబ్, ఆరెంజ్, నోడ్ రెడ్, మస్కిటో, ఈజీఈడీఏ సిమ్8085 ప్రదర్శనలో ఉన్నాయన్నారు. విద్యార్థులు నైపుణ్యాలు మెరుగుపర్చుకోవాలన్నారు. ఓఎస్డీ ప్రొఫెసర్ మురళీధర్శన్ ఏవో రణధీర్, అసోసియేట్ డీన్‌లు చంద్రశేఖర్రావు, మహేశ్ తదితరులు ఉన్నారు.

తాళం వేసిన ఇంట్లో రూ.లక్ష చోరీ

భైంసాటౌన్: పట్టణంలోని పాంచ్రిగల్లిలో తాళం వేసిన ఇంట్లో చోరీ జరిగింది. పట్టణ ఎస్సై శ్రీనివాస్ యాదవ్ కథనం ప్రకారం..కాలనీకి చెందిన పాలెపోల గంగాదాస్ ఈనెల 6న సాయంత్రం ఇంటికి తాళం వేసి కుభీర్‌లో శుభకార్యం నిమిత్తం వెళ్లారు. ఆదివారం ఉదయం తాళం పగులగొట్టి ఉండడం గమనించిన పక్కింటివారు గంగాదాస్‌కు సమాచారమిచ్చారు. దీంతో ఆయన ఇంటికి చేరుకున్నారు. ఇంట్లో వస్తువులు, బీరువా చిందరవందరగా ఉండడం చూసి పోలీసులకు సమాచారమివ్వగా, వారు అక్కడికి చేరుకుని పరిశీలించారు. బెడ్రూంలోని బీరువా నుంచి రూ.లక్ష వరకు నగదు అపహరణకు గురైనట్లు ఫిర్యాదులో పేర్కొన్నట్లు ఎస్సై తెలిపారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు వెల్లడించారు.

భవితకు భరోసా..!

- ఆటాపాటలతో విద్యాబోధన
- ఉమ్మడి జిల్లాలో 17 కేంద్రాలకు నిధులు
- ఒక్కో కేంద్రానికి రూ.2 లక్షలు విడుదల


ప్రత్యేకావసరాల పిల్లలకు ఫిజియోథెరపీ చేస్తున్న వైద్యులు

మంచిర్యాలఅర్బన్: ప్రత్యేకావసరాలు కలిగిన పిల్లలకు ఆటపాటలతో విద్య అందించేందుకు ప్రభుత్వం భవితకేంద్రాలు ఏర్పాటు చేసింది. 21 రకాల వైకల్యాలతో బాధపడే పిల్లలను గుర్తించి సేవలందించేందుకు 2010లో ఏర్పాటు చేసిన ఈ కేంద్రాలు వారికి భరోసా ఇస్తున్నాయి. విద్యాబుద్ధులు నేర్పించడం, మాట్లాడడం, నడిపించడం కోసం నిపుణులను నియమించారు. ఉమ్మడి జిల్లాల వారీగా మండలానికో కేంద్రాలను ఏర్పాటు చేశారు. వీటిలో సొంత భవనాలు ఉన్న వాటికి రూ.2 లక్షల చొప్పున నిధులు మంజూరయ్యాయి. ప్రత్యేక అవసరాలు కలిగిన పిల్లలకు రవాణా భత్యం, ఎస్కార్ట్ అలవెన్స్‌తోపాటు జూన్ 20 నుంచి సంవత్సరం వరకు బాలికలకు స్టైఫండ్, రీడర్ అలవెన్స్ నిధులు మంజూరు చేస్తూ ఉత్తర్వులు జారీ అయ్యాయి.

కొనుగోలు చేయాల్సినవి..

సులభంగా అర్థమయ్యేలా బోధన పరికరాలు, ఐఈఆర్పీలకు కుర్చీలు, బాస్కెట్‌బాల్, డంబుల్స్, రౌండ్ టేబుల్, అల్మారాలు, గ్రీన్ బోర్డు మ్యాగ్నెట్, వైల్డ్ ఎనిమాల్స్, ఫ్రూట్స్, టెడ్డీ రింగ్స్, గ్రీన్‌బోర్డు, బెడ్‌షీట్, సాండ్ బ్యాగ్, వాకింగ్‌బోర్డు, ప్లాస్టిక్ బాల్స్ తదితర 115 రకాల పిల్లలకు అవసరాల నిమిత్తం కొనుగోలు చేయాల్సి ఉంది. ఎంఈవో, స్కూల్ కాంప్లెక్స్ హెచ్‌ఎంలు, భవిత కేంద్రాలకు అనుసంధానంగా ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుల కమిటీ నేతృత్వంలో వీటిని సమకూర్చనున్నారు.

నిధులు మంజూరు..

ఉమ్మడి జిల్లాలోని పక్కా భవనాలు ఉన్న భవిత కేంద్రాలను ఎంపిక చేసి నిధులు మంజూరు చేశారు. ఒక్కో కేంద్రానికి రూ.2 లక్షలు మంజూరయ్యాయి. ఇందులో ఆదిలాబాద్ జిల్లాలో నాలుగు కేంద్రాలు, కుమురం భీం జిల్లాలో నాలుగు, నిర్మల్‌లో నాలుగు కేంద్రాలకు రూ.8 లక్షల చొప్పున, మంచిర్యాలలో ఐదు కేంద్రాలకు రూ.10 లక్షల నిధులు మంజూరయ్యాయి. ఆదిలాబాద్ అర్బన్, ఇచ్చోడ, జైనథ్, ఉట్నూర్, జైనూర్, కాగజ్‌నగర్, సిర్పూర్(టీ), జన్నారం, బెల్లంపల్లి, దండేపల్లి, కోటపల్లి, మందమర్రి తాండూర్, భైంసా, ముథోల్, నిర్మల్, ఖానాపూర్ కేంద్రాలకు నిధులు మంజూరయ్యాయి.

> ### చర్యలు తీసుకుంటున్నాం
> ప్రత్యేక అవసరాలు కలిగిన పిల్లలకు నిధులు మంజూరయ్యాయి. ఆటపాటలతో విద్యాబోధ న సాగనుంది. భవిత కేంద్రంలో విద్యార్థుల అభ్యున్నతి కోసం అన్ని చర్యలు తీసుకుంటున్నాం. ఎప్పటికప్పుడు సూచనలు చేస్తున్నాం.
> – యాదయ్య, డీఈవో, మంచిర్యాల

గతేడాది జూన్ నుంచి జనవరి వరకు..

భవిత కేంద్రాలకు వచ్చి వెళ్లే ప్రత్యేక అవసరాలు కలిగిన పిల్లలకు రవాణా భత్యం, ఎస్కార్ట్ అలవెన్స్, బాలికలకు స్టైఫండ్, రీడర్ అలవెన్స్ నిధులు మంజూరయ్యాయి. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా గతేడాది జూన్ నుంచి ఈ ఏడాది జనవరి వరకు 8 నెలల వరకు నిధులు మంజూరు చేశారు. మొత్తం ఆదిలాబాద్‌లో రూ.9,05,400, కుమరంభీం జిల్లాలో రూ.7,80,480, మంచిర్యాలలో రూ. 8,26,800, నిర్మల్‌లో రూ.13,59120 నిధులు మంజూరయ్యాయి.

రవాణా భత్యం ఇలా..

ఆదిలాబాద్ జిల్లాలో 92 మంది సీడబ్ల్యూఎస్ఎన్ పిల్లలకు రూ.3.68 లక్షలు, మంచిర్యాలలో 93 మందికి రూ.3.72 లక్షలు, కుమురం భీం ఆసిఫాబాద్‌లో 92 మందికి రూ.3.92 లక్షలు, నిర్మల్‌లో 116 పిల్లలకు రూ.46,400 రవాణా భత్యం విడుదల చేశారు.

ఎస్కార్ట్ నిధులు..

సీడబ్ల్యూఎస్ఎన్ పిల్లలను భవిత కేంద్రాలకు తీసుకువచ్చేందుకు రూ.500 చొప్పున నిధులు మంజూరయ్యాయి. ఆదిలాబాద్‌లో 40 మందికి రూ.1.60 లక్షలు, ఆసిఫాబాద్‌కు 68 మందికి రూ.2.72 లక్షలు, మంచిర్యాలలో 43 మందికి రూ.1.72 లక్షలు, నిర్మల్‌లో 121 మందికి రూ.4.81 లక్షల నిధులు మంజూరయ్యాయి.

స్టైఫండ్ నిధులు..

సీడబ్ల్యూఎస్ఎన్ బాలికలకు రూ.200 చొప్పున స్టైఫండ్ నిధులు మంజూరయ్యాయి. ఆదిలాబాద్ జిల్లాలో 224 మందికి రూ.3,58,200, కుమురంభీంలో 152 మందికి రూ.2,43,200, మంచిర్యాలలో 168 మందికి రూ. 2,68,400, నిర్మల్‌లో 246 మందికి రూ.3,93,000 నిధులు మంజూరు చేశారు.

రీడర్ నిధులు..

సీడబ్ల్యూఎస్ఎన్ పిల్లలకు రీడర్ అలవెన్స్ మంజూరయ్యాయి. ఒక్కొక్కరికి రూ.60 చొప్పున మంజూరయ్యాయి. ఆదిలాబాద్ జిల్లాలో 40 మందికి రూ.19,200, కుమురంభీంలో 36 మందికి రూ.17,280, మంచిర్యాలలో 30 మందికి రూ.14,400, నిర్మల్‌లో 44 మందికి రూ.21,120 నిధులు మంజూరయ్యాయి.

బాసరలో భక్తుల రద్దీ


అమ్మవారి దర్శనానికి క్యూలో వేచిఉన్న భక్తులు


చిన్నారికి అక్షర స్వీకారం చేస్తున్న అర్చకుడు

బాసర(ముధోల్): బాసర సరస్వతి అమ్మవారి ఆలయంలో ఆదివారం భక్తుల రద్దీ పెరిగింది. అమ్మవారిని దర్శించుకునేందుకు తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, మహారాష్ట్ర నుంచి భక్తులు అధికసంఖ్యలో తరలివచ్చారు. పవిత్ర గోదావరినదిలో పుణ్యస్నానం ఆచరించిన భక్తులు ప్రత్యేక అక్షరాభ్యాస మండపంలో తమ చిన్నారుల చేత అక్షర శ్రీకారం, కుంకుమార్చన పూజలు చేయించారు. శ్రీ జ్ఞాన సరస్వతి, మహాకాళి, మహాలక్ష్మి అమ్మవార్లకు ప్రత్యేక పూజలు చేశారు. పదోతరగతి పరీక్షలు సమీపిస్తుండడంతో విద్యార్థులు అమ్మవారి దర్శనానికి బారులు తీరారు.

'లాంగ్‌వాల్ ప్రాజెక్టుపై వైఖరి చెప్పాలి'


మాట్లాడుతున్న మాజీ ఎంపీపీ, తదితరులు

బెల్లంపల్లి: శాంతిఖని లాంగ్‌వాల్ ప్రాజెక్టుపై ప్రజాప్రతినిధులు తమ వైఖరి చెప్పాలని బెల్లంపల్లి మాజీ ఎంపీపీ గోమాస శ్రీనివాస్, ప్రభావిత గ్రామాల రైతులు డిమాండ్ చేశారు. బెల్లంపల్లి ప్రెస్‌క్లబ్‌లో ఆదివారం ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడారు. లాంగ్‌వాల్ ప్రాజెక్టు వల్ల ఆకెనపల్లి, పాతబెల్లంపల్లి, లింగాపూర్, తాళ్లగురిజాల, బట్వాన్‌పల్లి, పెర్కపల్లి గ్రామాలు ప్రభావితం అవుతాయని తెలిపారు. ఆ గ్రామాల్లో సాగు, తాగునీటి కష్టాలు ఎదురవుతాయన్నారు. చెరువుల్లో ఇప్పటికే భూగర్భజలాలు అడుగంటిపోయిందన్నారు. పర్యావరణ ప్రజాభిప్రాయసేకరణలో రైతులు, ప్రజలు పాల్గొని ఈ ప్రాజెక్టు వద్దని నిరసన తెలిపినా ఎమ్మెల్యే వినోద్, ప్రజాప్రతినిధులు ఎందుకు స్పందించలేదని ప్రశ్నించారు. ప్రభుత్వం సమస్య తీవ్రతను దృష్టిలో పెట్టుకుని ప్రభావిత గ్రామాల ప్రజల సమస్యలు పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. సమావేశంలో ప్రభావిత గ్రామాల వాసులు రామటెంకి ప్రసాద్, గోమాస వినోద్‌కుమార్, దుర్గం జయరాజ్ తదితరులు పాల్గొన్నారు.

తెలంగాణ గల్ఫ్ కార్మికుల సంక్షేమ సమితి రాష్ట్ర కార్యవర్గం


కల్లెడ భూమయ్య

జన్నారం: తెలంగాణ గల్ఫ్ కార్మికుల సంక్షేమ సమితి(టీజీడబ్ల్యూడబ్ల్యూసీ) రాష్ట్ర నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు వ్యవస్థాపక అధ్యక్షుడు కల్లెడ భూమయ్య, రాష్ట్ర ఇన్‌చార్జి ఎరుకల రాజుగౌడ్ తెలిపారు. సంస్థ కోసం నిబద్ధతతో పనిచేసిన సభ్యులను గుర్తించి నూతన రాష్ట్ర కార్యవర్గంలో చోటు కల్పించినట్లు పేర్కొన్నారు. గౌరవ అధ్యక్షుడిగా సేపూరి గోపాల్, రాష్ట్ర ఇన్‌చార్జిగా పు రంశెట్టి నాగేశ్, ఉపాధ్యక్షులుగా పెరుగు మల్లికార్జున్, అమరగుండ తిరుపతి, ప్రధాన కార్యదర్శులుగా పాలాజీ శ్రీనివాస్, పరకాల మహేశ్, కన్వీనర్‌గా నంద సుదర్శన్, వర్కింగ్ ప్రెసిడెంట్లుగా కాశెట్టి తిరుపతి, అలీమ్, కోశాధికారిగా అమర కొండ మల్లేశ్, అధికార ప్రతినిధిగా సందెల తిరుపతి, కార్యదర్శిగా కొడిజుట్టు నరేశ్, సంయుక్త కార్యదర్శి గా హసన్, ప్రచార కార్యదర్శిగా జునుగూరు నాగరాజు, ముఖ్య సలహాదారుగా లింగం అంజన్నను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

ఎడ్లబండిని ఢీకొట్టిన బైక్

- ఒకరు మృతి


కాశీనాథ్ (ఫైల్)

బజార్‌హత్నూర్: ఎడ్లబండిని బైక్ ఢీకొట్టిన ఘటనలో ఒకరు మృతిచెందాడు. ఎస్సై అప్పారావ్ కథనం ప్రకారం.. మండలంలోని కొలారి గ్రామానికి చెందిన కాలే కాశీనాథ్ (54) బైక్‌పై మండల కేంద్రానికి వెళ్లాడు. పని ముగించుకుని స్వగ్రామానికి వస్తున్నాడు. శనివారం రాత్రి కొలారి సమీపంలో బ్రిడ్జి వద్ద ఎదురుగా వస్తున్న ఎడ్లబండిని ఢీకొట్టాడు. తీవ్ర గాయాలైన కాశీనాథ్‌ను వెంటనే బజార్‌హత్నూర్ పీహెచ్‌సీకి తరలించి చికిత్స అందించారు. మెరుగైన వైద్యం కోసం 108లో ఆదిలాబాద్ రిమ్స్‌కు తరలిస్తుండగా మార్గమధ్యలో మృతిచెందాడు. ఈమేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరు మృతి

- ఆగి ఉన్న ఐచర్ వాహనాన్ని ఢీకొట్టిన బస్సు
- బస్సులోని ఇద్దరు డ్రైవర్లు దుర్మరణం
- పలువురికి గాయాలు.. రిమ్స్‌కు తరలింపు
- ఆదిలాబాద్ జిల్లాలో ఘటన



లొచన్ సాహు, ప్రదీప్ సాహు మృతదేహాలు


నుజ్జునుజ్జయిన బస్సు ముందు భాగం

ఆదిలాబాద్‌రూరల్: వారంతా రాత్రి వేళలో బస్సులో ప్రయాణిస్తున్నారు.. గాఢనిద్రలో ఉన్నారు.. ఒక్కసారిగా పెద్ద శబ్దం రావడంతో ఉలిక్కిపడ్డారు.. అప్పటికే ఎదురుగా ఉన్న ఐచర్ వాహనాన్ని బస్సు వెనకనుంచి ఢీకొట్టింది. ప్రయాణికులంతా చెల్లాచెదురయ్యారు. పలువురికి గాయాలయ్యాయి. కొందరు అద్దాలు పగులగొట్టి కిందికి దూకారు. బస్సు ముందు భాగం నుజ్జునుజ్జయింది. డ్రైవర్‌తోపాటు అదనపు డ్రైవర్ తీవ్రగాయాలతో క్యాబిన్లో చిక్కుకుని అక్కడికక్కడే దుర్మరణం పాలయ్యారు. ఈ ఘటన ఆదిలాబాద్ రూరల్ పోలీస్‌స్టేషన్ పరిధి 44వ నంబర్ జాతీయ రహదారిపై ఆదివారం వేకువజామున చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళితే.. హైదరాబాద్ నుంచి మధ్యప్రదేశ్‌లోని జబల్‌పూర్ కు వయా నాగపూర్ మీదుగా ప్రైవేట్ బస్సు ప్రయాణికులతో వెళ్తోంది. అదే మార్గం గుండా నిర్మల్ వైపు నుంచి మహారాష్ట్ర వైపునకు కట్టెల లోడ్‌తో ఐచర్ వాహనం వెళ్తుంది. ఆదిలాబాద్‌రూరల్ మండల పరిధిలో గల జాతీయ రహదారిపై జియో పెట్రోల్ పంపు ఎదుట ఐచర్ వాహనం టైర్ పగిలిపోయింది. డ్రైవర్ ఎలాంటి హెచ్చరిక ఏర్పాటు చేయకుండా వాహనాన్ని రోడ్డుపైనే నిలిపాడు. దీంతో వెనక నుంచి వస్తున్న బస్సు ఐచర్‌ను వేగంతో ఢీ కొట్టడంతో బస్సు డ్రైవర్ ప్రదీప్ సాహు (35), పక్కనే ఉన్న అదనపు డ్రైవర్ లొచన్ సాహు (33) అక్కడికక్కడే మృతి చెందారు. పలువురు ప్రయాణికులకు తీవ్ర గాయాలయ్యాయి. వారిని వెంటనే రిమ్స్‌కు తరలించారు. బస్సు క్యాబిన్‌లో ఇరుక్కున్న డ్రైవర్ల మృతదేహాలను క్రేన్ సాయంతో తీశారు. విషయం తెలుసుకున్న నేషనల్ హైవే పెట్రోలింగ్ పోలీసులు అక్కడికి చేరుకున్నారు. సంబంధిత పోలీసులకు సమాచారం అందజేశారు. ఎస్పీ గౌస్ ఆలం, డీఎస్పీ జీవన్‌రెడ్డి, ఆదిలాబాద్ రూరల్ సీఐ ఫణిదర్, ఎస్సై ముజాహిద్ ఘటనాస్థలానికి చేరుకున్నారు. ప్రమాదం జరిగిన తీరుపై ఆరా తీశారు. పోలీసులు తెలిపిన ప్రకారం.. మధ్యప్రదేశ్ రాష్ట్రానికి చెందిన లొచన్ సాహు, ఛత్తీస్‌గఢ్‌కు చెందిన ప్రదీప్ సాహులు కన్కర్ ట్రావెల్స్‌పై బస్సు డ్రైవర్‌గా పనిచేస్తున్నారు. వీరు శనివారం హైదరాబాద్ నుంచి సుమారు 40 మంది ప్రయాణికులతో మధ్యప్రదేశ్‌లోని జబల్‌పూర్‌కు బయలుదేరారు. ఈక్రమంలో ఆదిలాబాద్ వద్ద ప్రమాదం చోటు చేసుకుందని వివరించారు. ప్రమాద సూచిక లేకుండా రోడ్డుపై వాహనం నిలిపిన ఐచర్ వాహన డ్రైవర్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు. గాయపడ్డ వారిలో.. చత్తీస్‌గఢ్‌కు చెందిన కమ్‌లేష్ పాల్, జబల్‌పూర్‌కు చెందిన ముఖేష్ సాహు, మన్ని, సునిత సాహు, బన్స్కార్ అనిత, ప్రయాగ్‌రాజ్‌కు చెందిన ఎండీ సాహు, మధ్యప్రదేశ్‌కు చెందిన శిప్రి దీపక్, జైస్వాల్ ప్రదీప్ కుమార్, ప్రజ్ఞా ఉన్నారు.

వ్యభిచార ముఠా గుట్టురట్టు

మంచిర్యాలక్రైం: జిల్లాకేంద్రంలోని రాజీవ్‌నగర్‌లో వ్యభిచార ముఠాను ఆదివారం పోలీసులు గుట్టురట్టుచేశారు. ఎస్సై ప్రవీణ్‌కుమార్ కథనం ప్రకారం.. రాజీవ్‌నగర్‌కు చెందిన ముత్తినేని మాధవి ఇంటిని వైష్ణవి వ్యభిచారం నిర్వహిస్తోంది. ఇతర ప్రాంతాల నుంచి మహిళలను తీసుకువచ్చి గత కొంత కాలంగా ఈ దందాను సాగిస్తోంది. ఆదివారం అందిన పక్కా సమాచారంతో ఎస్సై, సిబ్బంది ఆకస్మిక దాడి చేశారు. ఈ దాడిలో విటుడు సీసీసీ నస్పూర్ తీగలపహాడ్‌కు చెందిన సింగరేణి ఉద్యోగి సిరికొండ శ్రీనివాస్, మహిళ పట్టుబడ్డారు. మాధవి, శ్రీనివాస్, బాధిత మహిళలను అరెస్ట్ చేసినట్లు ఎస్సై తెలిపారు. ఈమేరకు కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు. కాగా, వైష్ణవి పరారీలో ఉందని పేర్కొన్నారు.

చెరువులో పడి వ్యక్తి మృతి


శ్రీను మృతదేహం

సోన్: చేపల వేటకు వెళ్లి ప్రమాదవశాత్తు చెరువులో పడి వ్యక్తి మృతిచెందాడు. ఎస్సై గోపి కథనం ప్రకారం..మండలంలోని సిద్దలకుంటకు చెందిన దేవోల్ల శ్రీను(30) శనివారం మాదాపూర్, సిద్దులకుంట గ్రామాల శివారులో చెరువులో చేపల వేటకు వెళ్లాడు. ప్రమాదవశాత్తు జారిపడి మృతి చెందాడు. మృతుడి బావ ఫిర్యాదుతో ఆదివారం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

విద్యుత్‌షాక్‌తో వివాహిత..


తిరుమల (ఫైల్)

లక్సెట్టిపేట: స్నానానికి వేడి నీళ్లు పెడుతుండగా విద్యుత్ షాక్‌తో వివాహిత మృతిచెందింది. ఎస్సై సతీశ్ కథనం ప్రకారం .. మున్సిపాలిటీ పరిధిలోని ఇటిక్యాల గ్రామానికి చెందిన గంధం తిరుమల(42), తిరుపతి భార్యభర్తలు. ఇద్దరు పిల్లల సంతానం. భర్త కూలీ పనులు చేసుకుంటూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. ఆదివారం ఉదయం తిరుమల స్నానం చేసేందుకు బకెట్‌లో నీళ్లు పోసి వాటర్ హీటర్ వేసి స్విచ్ ఆన్ చేసింది. ఆమె కాలు బకెట్‌ను ఆనుకుని ఉండడంతో విద్యుత్ సరఫరా అయి షాక్‌కు గురైంది. కేకలు వేయడంతో కుటుంబ సభ్యులు వెంటనే విద్యుత్ సరఫరా నిలిపివేశారు. ఆమెను ఆస్పత్రికి తరలించారు. పరిశీలించిన వైద్యులు అప్పటికే మృతిచెందినట్లు నిర్ధారించారు. మృతురాలి తల్లి ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేస్తున్నట్లు వెల్లడించారు.

కానిస్టేబుల్ ఆత్మహత్యాయత్నం

తిర్యాణి: అనారోగ్య సమస్యలతో జీవితంపై విరక్తితో కానిస్టేబుల్ గడ్డి మందుతాగిఆత్మహత్యాయత్నంచేశాడు. ఈ ఘటన మండలంలో చోటుచేసుకుంది. ఎస్సై శ్రీకాంత్‌కథనంప్రకారం..మంచిర్యాల జిల్లా రాజంపేట గ్రామానికి చెందిన ముద్దసాని పవన్(25)2024లో టీఎస్ఎస్పీలో కానిస్టేబుల్‌గా ఎంపికయ్యాడు. తిర్యాణి పోలీసుస్టేషన్‌లో విధులు నిర్వహిస్తున్నాడు. గత కొంత కాలంగా కళ్లలో మంట, తదితర అనారోగ్య సమస్యలతో బాధపడుతున్నాడు. ఈక్రమంలో ఆదివారం బయటికి వెళ్లిన పవన్ తిర్యాణి, తాండూర్ మార్గమధ్యలో గడ్డి మందు తాగాడు.గమనించిన కొందరుపోలీసులకుసమాచారం అందించారు. వారు అక్కడికి చేరుకుని తిర్యాణి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. వైద్యుల సూచనలతో మంచిర్యాల ప్రభుత్వ ఆసుపత్రిలో చేర్పించారు.కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

బైక్ చోరీ

ఆదిలాబాద్‌టౌన్: పట్టణంలోని అశోక్‌రోడ్ కాలనీకి చెందిన బి.కిషన్ బైక్ చోరీకి గురైంది. ఈనెల 8నకూరగాయల మార్కెట్‌లో పార్కింగ్ చేసి వెళ్లారు. తిరిగి వచ్చేసరికి కనిపించలేదు. చుట్టుపక్కల గాలించిన దొరకకపోవడంతో బాధితుడు ఆదివారం వన్‌టౌన్ పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ సునీల్‌కుమార్ తెలిపారు.